సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



కలెక్టర్‌ను కలిసిన ఫైర్ అధికారి

పెద్దపల్లిరూరల్: కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను గురువారం అగ్నిమాపక శాఖ అధికారి ఖాజాకరీం, జిల్లా అధికారి దేవనంది శ్రీనివాస్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



టెండర్ వేద్దామా? ఆగుదామా?

డిసెంబర్ ఒకటో తేదీ నుంచి కొత్త ఎక్సైజ్ పాలసీ ప్రారంభం కానుంది. ఆదాయం కోసం ప్రభుత్వం ఆగస్టులో టెండర్లు పిలిచిందని వైన్స్‌ల నిర్వాహకులు అంటున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం తక్కువగా ఉంది.

న్యూస్‌రీల్

పంద్రాగస్టుకు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులకు సూచనలిస్తున్న శ్యాంప్రసాద్

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలో నిర్వహించే స్వాతంత్య్ర వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ పథకాలకు ఎంపికైన వారికి పంపిణీ చేసే ఆస్తుల వివరాలను అధికారులు సిద్ధం చేయాలన్నారు. ఉత్తమ ఉద్యోగుల వివరాలను ప్రతి కార్యాలయం నుంచి ప్రతిపాదనలు ఇవ్వాలని పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో ఆటోక్లేవ్ స్టెరిలైజర్లు ప్రారంభం



యంత్రాలను పరిశీలిస్తున్న దయాల్‌సింగ్

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో మూడు ఆటోక్లేవ్ స్టెరిలైజర్ యంత్రాల సేవలను ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ గురువారం ప్రారంభించారు. ఆపరేషన్ సమయంలో ఉపయోగించే వస్తువులు, దుస్తులపై బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్ తదితర సూక్ష్మజీవులను చంపడానికి ఆవిరితో పనిచేసే ఈ స్టెరిలైజేషన్ యంత్రాలను వినియోగిస్తామని సూపరింటెండెంట్ తెలిపారు. త్వరలో గ్యాస్ ఆధారితమైన మరో ఆధునాతన స్టెరిలైజర్ యంత్రాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైద్యులు అరుణ, భానులక్ష్మి, ఫరీద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ గోదాంలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని పౌరసరఫరాల శాఖ గోదాంలో గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీం ఓఎస్డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో అధికారులు రికార్డులు పరిశీలించారు. గోదాములో ఉన్న నిల్వలు రికార్డుల్లోకంటే 40 క్వింటాళ్ల వరకు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఇన్‌స్పెక్టర్లు జంగయ్య, కృష్ణ, డీటీ శంకర్, ఇన్‌స్పెక్టర్లు షఫీ, రాజేందర్, రవీందర్ ఉన్నారు.

16న సదరం క్యాంప్ స్లాట్ బుకింగ్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఈనెల 16న మీసేవ కేంద్రాల్లో సదరం స్లాట్‌బుకింగ్ చేసుకోవాలని డీఆర్‌డీఓ శ్రీధర్ తెలిపారు. శారీరక అంగవైకల్యం వైద్య నిర్ధారణ పరీక్షలకు ఈనెల 19న ప్రత్యేక సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్లాట్ బుకింగ్ అనంతరం మెడికల్ క్యాంపులకు వచ్చే సందర్భంలో దరఖాస్తుదారు తమ వద్ద ఉన్న ఆధారాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

వ్యాపారంలో సుల్తానాబాద్ సొసైటీ ఆదర్శం



మార్కెట్‌ను పరిశీలిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్

సుల్తానాబాద్: వ్యాపారరంగంలో సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉమ్మడి జిల్లాలోనే ఆదర్శంగా నిలిచిందని డీసీఎంఎస్ చైర్మన్ వి.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న వాటర్‌ప్లాంట్, సూపర్ మార్కెట్, ప్రాథమిక వ్యవసాయ సహకార భవనాలను సందర్శించారు. సూపర్ మార్కెట్, వాటర్‌ప్లాంట్, ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడం శుభపరిణామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఫక్రుద్దీన్, డైరెక్టర్లు నారాయణ, భూమారెడ్డి, బిజినెస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, సుల్తానాబాద్ సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సీఈవో బుర్గు సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

గృహ‘లక్ష’ దరఖాస్తులు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 99,696
- అర్జీదారులతో కిక్కిరిసిన కార్యాలయాలు
- అత్యధికంగా పెద్దపల్లిలో 14,753
- ఈనెల 20లోగా పరిశీలన పూర్తి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వచ్చిన గృహలక్ష్మి దరఖాస్తులు

కరీంనగర్	3,429
కోరుట్ల	6,730
మానకొండూరు	4,499
వేములవాడ	12,913
సిరిసిల్ల	9,979
చొప్పదండి	3,176
హుజూరాబాద్	13,437
పెద్దపల్లి	14,753
రామగుండం	7,402
మంథని	7,950
జగిత్యాల	8,120
ధర్మపురి	7,308
మొత్తం	99,696



పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బారులు తీరిన మహిళలు

సాక్షి, పెద్దపల్లి: రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 99,696 దరఖాస్తులు వచ్చాయి. నియోజకవర్గానికి మూడు వేల మందిని మొదటి విడతలో ఎంపిక చేయనుండడం.. గురువారం చివరిరోజు కావడంతో దరఖాస్తుదారులు పోటెత్తారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు కిక్కిరిశాయి. గృహలక్ష్మి నిరంతర ప్రక్రియ అని, నిర్ణీత గడువులేదని మంత్రులు ప్రకటిస్తున్నా.. మొదటి విడతలోనే సహాయం పొందాలని భావిస్తున్న వివిధ వర్గాల ప్రజలు అర్జీలు పెట్టుకునేందుకు తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్ద బారులు తీరారు. కావాల్సిన సర్టిఫికెట్లు, దరఖాస్తుల కోసం అర్జీలు పెట్టుకునే వారితో మీసేవా కేంద్రాల్లో రద్దీ నెలకొంది.

అత్యధికంగా పెద్దపల్లి నియోజకవర్గంలో..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 12 నియోజకవర్గాల పరిధిలో 99,696 దరఖాస్తులు వచ్చాయి. అందులో అత్యధికంగా పెద్దపల్లి నియోజకవర్గంలో14,753 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా చొప్పదండి నియోజకవర్గంలో చొప్పదండి 3,176 దరఖాస్తులు వచ్చాయి. గురువారం వరకు వచ్చిన దరఖాస్తుదారులను గుర్తించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, అర్హులైన వారి జాబితాను ఈనెల 20లోగా ప్రకటించాలని నిర్ణయించారు. గడువు (ఈనెల10) తరువాత వచ్చిన దరఖాస్తులను రెండోవిడుతలో పరిశీలించాలని నిర్ణయించారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలించి, ప్రతి నియోజకవర్గంలో ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీ, మైనార్టీలకు 50 శాతానికి తగ్గకుండా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

అసౌకర్యాలతో ఇబ్బందులు పడిన మహిళలు

గృహలక్ష్మికి మహిళల పేరు మీద దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. దీంతో దరఖాస్తు చేసుకోవడానికి మహిళలు, వారి భర్తలు, పిల్లలతో ఆయా కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. అక్కడ పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అనాథ బాలల సర్వే

- నాలుగు మున్సిపాలిటీలలో వివరాల సేకరణ
- ఇంటింటికీ తిరుగుతున్న బృందాలు
- ఆన్‌లైన్‌లో వివరాల నమోదు



సర్వే చేస్తున్న రామగుండం బల్దియా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు

కోల్‌సిటీ: అనాథ పిల్లల సంరక్షణ, ఆలనాపాలనను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగానే రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో అధికారులు అనాథ బాలల వివరాలు సేకరిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలు జారీచేసింది. మున్సిపాలిటీల్లో సర్వే నిర్వహించాలంటూ కమిషనర్లకు రాష్ట్ర పురపాలక శాఖ సీడీఎంఏ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గురువారం నుంచి జిల్లాలోని రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో అనాథ బాలల వివరాలను ప్రత్యేక బృందాలు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్నాయి.

రామగుండంలో 167 మందితో సర్వే

కార్పొరేషన్‌లో అనాథ బాలల వివరాలు సేకరించడానికి డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వరరావుతో కలిసి మున్సిపల్ కమిషనర్ జి.సుచరణ్ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. సర్వే చేయాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. సర్వేను త్వరితగితన పూర్తి చేయడానికి 167 మందిని కేటాయించారు. ఇందులో మెప్మా విభాగంలో స్మార్ట్ ఫోన్ కలిగిన 97 మంది ఆర్పీలు, 17 మంది బిల్‌కలెక్టర్లు, 22 మంది అంగన్‌వాడీ టీచర్లను నియమించారు. వీరంతా ఇంటింటికీ తిరిగి సర్వే ప్రక్రియను మొదలెట్టారు. అనాథ బాలల వివరాలను ఈనెల 15లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులో జారీ చేసింది.

వివరాల నమోదుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్

సర్వేలో గుర్తించిన అనాథ పిల్లల వివరాలను పొందుపర్చడానికి ప్రభుత్వం ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. సర్వే చేస్తున్న సిబ్బంది వివరాలను ఇప్పటికే సీడీఎంఏ కార్యాలయానికి పంపించగా.. వారందరికీ అధికారులు ప్రత్యేక యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు కేటాయించారు. ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది స్మార్ట్‌ఫోన్‌లోనే ఆన్‌లైన్‌లో అక్కడిక్కడే వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంది. సర్వే తీరును జిల్లా ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులు, సీడీఎంఏ ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

సమగ్ర సర్వే కోసం ఆన్‌లైన్ ఫారం

అనాథ పిల్లల వివరాల సమగ్రవంతంగా ఉండటానికి రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లోనే ప్రత్యేక ప్రొఫార్మాను పొందుపరిచింది. పిల్లల పేర్లు, ఆధార్ కార్డ్ నంబర్, చిరునామా, తల్లిదండ్రుల పేర్లు, వారు చనిపోయిన సంవత్సరం, కులం, ఎక్కడ చదువుతున్నారు..? ఎవరి సంరక్షణలో ఉన్నారు..? తదితర 16 అంశాలతో సమగ్రంగా ఫారంను ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందుపరిచారు. వీటి ఆధారంగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులు సూచించారు.

జనం గుండెల్లో నిలిచిన కళాకారుడు మిద్దె రాములు

- జయంతి వేడుకలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు



మిద్దె రాములు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మధు

మంథని: ఒగ్గు కథలతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన కళాకారుడు మిద్దె రాములు అని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. ఆయన జయంతి సందర్భంగా మంథనిలోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో పుట్ట లింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని కళాకారులను సన్మానించి మెమొంటోలు అందించారు. మిద్దె రాములు ప్రజల గుండెల్లో నిలిచిపోయారని, వేలమంది శిష్యులను తయారు చేశారని కొనియాడారు. అలాంటి మహనీయుల చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఆలోచనతో వారి విగ్రహాలను మంథనిలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పదవుల కోసం ఆరాటపడేవారిని కాకుండా ప్రజల ఆకలి తీర్చేవారిని పాలకుడిగా ఎన్నుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. రానున్న రోజుల్లో పేదల కోసం హైదరాబాద్‌లో వసతి కల్పించేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముందుగా ఆయన నివాసం నుంచి రేణుకాఎల్లమ్మ ఆలయం వరకు బోనంతో వచ్చి అమ్మవారికి బోనం సమర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంత రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్ ఉన్నారు.

మున్నూరుకాపులు ఐక్యత చాటాలి

- మున్నూరు కాపు రైతు రక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజు



మాట్లాడుతున్న చామకూర రాజు

మంథని: రాష్ట్రంలో అత్యధికంగా జనాభా ఉన్న మున్నూరుకాపులు ఐక్యంగా ఉండి అన్నిరంగాల్లో రాణించాలని మున్నూరుకాపు రైతు రక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చామకూర రాజు పిలుపునిచ్చారు. గురువారం మంథనిలో గురువారం మున్నూరు కాపు ఐకాన్ అవార్డులను ప్రదానం చేశారు. కాపులు శాసించే స్థాయికి చేరుకోవాలన్నారు. కులమే బలమని, కులానికి చెందిన నాయకులకు పూర్తిస్థాయిలో మద్దతు నిచ్చి గెలిపించుకోవాలని సూచించారు. ముందుగా కేంద్ర మాజీ మంత్రి, మాజీ గవర్నర్ పుంజాల శివశంకర్ 94వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మల్క రామస్వామి, నాయకులు పెండం సంపత్, కొత్త శ్రీనివాస్, ఆకుల కిరణ్, జక్కుల ముత్తయ్య, అమిరిశెట్టి రామస్వామి, కొట్టె రమేశ్, పుల్లెల కిరణ్, సీపతి బానయ్య,తో పాటు ఉన్నారు.

ముదిరాజ్ కులస్తులు కింగ్‌మేకర్ కావాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నర్సయ్య

సుల్తానాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజ్ ఓటర్లు కింగ్ మేకర్లు కావాలని మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఐదు శాతం కూడా లేని అగ్రకులాలు ఆధిపత్యం చెలాయిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ముదిరాజ్ కులస్తులు ఓటు వేసినవారే గెలిచేలా చూడాలని సూచించారు. నియోజకవర్గంలో ముదిరాజుల ఓట్లు 60వేలు ఉన్నాయని, ఐక్యంగా నిలిచి ఓట్లు చీలకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు. త్వరలో జిల్లాకేంద్రంలో ఐదు వేల మందితో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ముందుగా పట్టణంలో బైక్ ర్యాలీ తీశారు. సంఘం జిల్లా నాయకులు వీరస్వామి, గరిగంటి కుమార్ బాబు, 18వ వార్డు కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి స్నేహితులతో కాసేపు..



ధర్మారం: మంచిర్యాల జిల్లా పర్యటనకు వెళ్లిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్.. తిరుగు ప్రయాణంలో పెద్దపల్లి జిల్లా ధర్మారంలో ఉన్న తన చిన్ననాటి మిత్రులు జైన చందూ, జైన రాజును కలిశారు. వారితో కలిసి చౌరస్తాలోని ఓ హోటల్‌లో బల్లపై కూర్చుని టీ తాగారు. వారితో దాదాపు 30 నిమిషాలు సరదాగా గడిపారు. మంత్రి స్వగ్రామం వెల్గటూర్ మండలం పైడిపల్లికి చెందిన ఆర్యవైశ్యులు మండలకేంద్రంలో వ్యాపారాలు చేసుకుంటూ స్థిరపడ్డారు. చిన్నతనంలో వారితో కలిసి పెరిగిన గంగుల వారితో ఉల్లాసంగా గడిపారు.

అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శం

- విద్యాశాఖ ప్రక్షాళనతో అనూహ్య మార్పు
- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



మనఊరు-మనబడి కింద ఎంపికైన పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం:రాష్ట్రంలో విద్యాశాఖ ప్రక్షాళనతో ప్రభుత్వ పాఠశాలల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మేడారం గ్రామపంచాయతీ పరిధి నల్లలింగయ్యపల్లి, బొట్లవనపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన ఊరు - మనబడి కార్యక్రమం కింద చేపట్టిన భవనాలను గురువారం ప్రారంభించారు. ఖిలావనపర్తిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. విద్య సమాజానికి వికాసంగా భావించిన సీఎం కేసీఆర్ విద్యాలయాల కోసం వేల కోట్లు వెచ్చిస్తున్నారని, ఇందులో భాగంగానే రాష్ట్రంలో 1,006 రెసిడెన్షియల్ విద్యాలయాలు ఏర్పాటు చేసి 6.50లక్షల మంది నిరుపేద పిల్లలకు విద్య అందిస్తున్నారని పేర్కొన్నారు. మండలంలో మన ఊరు మనబడి కింద 18 పాఠశాలలను ఎంపిక చేసి రూ.2.21కోట్ల వ్యయంతో వసతులు, డిజిటల్ పరికరాలు సమకూర్చామన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకొచ్చాక మేడారం గ్రామానికి కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామంలో 80శాతం రోడ్లు పూర్తి చేశామని, 30 పడకల ఆసుపత్రి నిర్మిస్తున్నామని తెలిపారు. త్వరలో పర్యాటన కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. వర్షకాలంలో ముంపునకు గురవుతున్న తెనుగువాడ సమస్య పరిష్కారానికి రూ.3.7కోట్లతో డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. సర్పంచులు సామంతుల జానకి, రెడపాక ప్రమీల, సాగంటి తారకొండయ్య, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ.సలామొద్దీన్, ధర్మపురి ఆలయ కమిటీ డైరెక్టర్ జైన రాజమౌళి, ఎంపీటీసీలు మిట్ట తిరుపతి, కట్ట సరోజన, మోతె సుజాత, కనుకయ్య, ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ రజిత, ఎంపీడీవో జయశీల, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించాలి

- సైబర్ నేరాల్లో ఫ్రీజ్ డబ్బులు బాధితులకు ఇప్పించాలి
- ఎస్సీ, ఎస్టీ కేసులు 60 రోజుల్లోగా పూర్తి చేయాలి
- నేర సమీక్షలో సీపీ రెమా రాజేశ్వరి



ఆటో డ్రైవర్లకు క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: కమిషనరేట్ పరిధిలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై దృష్టి సారించాలని సీపీ రెమా రాజేశ్వరి అన్నారు. గురువారం తన కార్యాలయంలో నేర సమీక్ష నిర్వహించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని, సరిహద్దు ప్రాంత అధికారులతో సమన్వయం చేస్తూ నిఘా ఉంచాలని, ఫెర్రీ పాయింట్స్‌పై నిఘా పెట్టాలని, కూంబింగ్, ఆకస్మిక తనిఖీలు, నాకాబందీలు, ఆర్‌ఓపీలు, కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కళాబృందాలతో ప్రదర్శనలు ఇవ్వాలని, నిరుద్యోగ యువత శిక్షణ ఇప్పించాలని పేర్కొన్నారు. జాబ్‌మేళాలు, మెడికల్ క్యాంపులు ఏ ర్పాటు చేయాలన్నారు. ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులను త్వరగా పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని సూచించారు. సైబర్ నేరాల్లో ఫ్రీజ్ అయిన డబ్బులను బాధితులకు ఇప్పించాలని ఆదేశించారు. నేరాలు నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమన్నారు. నేరం జరిగిన వెంటనే నిందితులను పట్టుకోవడానికి సీసీ ఫుటేజీలు ఉపయోగపడతాయన్నారు.

ప్రశంసపత్రాల అందజేత

భారీ వర్షాలకు వరదలు వచ్చిన సమయంలో ధైర్యంగా విధులు నిర్వర్తించిన అధికారులు, సిబ్బందికి సీపీ ప్రశంసాపత్రాలు అందించారు. పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకన్‌ను అభినందించారు. గతనెల ఫంక్షనల్ వర్టికల్స్‌లో ప్రతిభ కనబరిచిన 9మంది సీఐలు, 23మంది ఎస్సైలు, ఐదుగురు ఏఎస్సైలు, 20మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 51మంది కానిస్టేబుళ్లకు రివార్డు మేళా నిర్వహించారు. సమావేశంలో డీసీపీలు వైభవ్‌గైక్వాడ్, మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకన్, అడిషనల్ ఏఆర్ డీసీపీ రియాజ్ హుల్‌హక్, ఏసీపీలు తులా శ్రీనివాసరావు, తిరుపతిరెడ్డి, మోహన్, సదయ్య, వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

భద్రత కోసం అభయ అప్లికేషన్

ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ఆటోలకు క్యూఆర్ కోడ్, యూనిక్ నంబర్లను సీపీ రెమా రాజేశ్వరి కేటాయించారు. మహిళలు సురక్షితంగా, పూర్తి రక్షణతో ప్రయాణించేందుకు ఈయాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రయాణ సమయాల్లో ఆకతాయి డ్రైవర్ల ఆటకట్టించేందుకు క్యూఆర్‌తో కూడిన యూనిక్ నంబర్ ఏర్పాటు చేశామన్నారు. ఆటోడ్రైవర్లు ప్రయాణికులను తప్పుదోవ పట్టించినా.. మార్గం మళ్లించినా.. అసభ్యంగా ప్రవర్తించినా.. మద్యం తాగి వాహనం నడిపినా మొబైల్ ఫోన్‌లో అభయ్ అప్లికేషన్ ఓపెన్ చేసి.. క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేస్తే వాహనం లైవ్ లొకేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుతుందని, పోలీసులు వాహనాన్ని ట్రేస్ చేసి దగ్గరలో ఉన్న పోలీస్ అధికారులకు సమాచారం ఇస్తారని వివరించారు. నేరాల కట్టడిలో ఈ అప్లికేషన్స్ కీలకంగా పనిచేస్తుందన్నారు. ఆటోల్లో సీటు వెనుకభాగంలో క్యూఆర్ కోడ్ విధిగా ఏర్పాటు చేసుకోవాలని డ్రైవర్లకు సూచించారు.

న్యాయవాద దంపతుల హత్య కేసులో మరొకరికి బెయిల్

మంథని: రామగిరి మండలం మారుతీనగర్ సమీపంలో 2021 ఫిబ్రవరి 17న జరిగిన న్యాయవాద దంపతులు గట్టు వామన్‌రావు-నాగమణి హత్య కేసులో నిందితుడిగా ఉన్న బిట్టు శ్రీనుకు గురువారం జిల్లాకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఏడుగురు నిందితుల్లో బిట్టు శ్రీను అలియాస్ తుల్సెగారి శ్రీనివాస్ ఏ-4గా ఉన్నాడు. అయితే గతనెల 11న మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన ఏ-3 అక్కపాక కుమార్, ఏ-5 ఊదరి లక్ష్మణ్ అలియాస్ లచ్చన్నకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఏ-6 వెల్ది వసంతరావు, ఏ-7 కాపు అనిల్‌కు గతంలోనే బెయిల్ లభించింది. ఏ-1గా ఉన్న కుంట శ్రీనివాస్, ఏ-2 చిరంజీవి చర్లపల్లి జైలులో అండర్ ట్రయల్ ఖైదీలుగా ఉన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పెద్దపల్లిరూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీయూపీఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం పెద్దపల్లి బస్టాండ్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత కాలంలో టీచర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపడం లేదని ఆరోపించారు. సీపీఎస్ విధానం రద్దు చేయాలని, 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. నాయకులు రవీందర్, రామేశ్వర్, రవి, సుమిత్ర, రజిత, లత, పుష్ప, అనిల్, ప్రసాద్, శ్రీనివాస్, రమేశ్‌బాబు, గణేశ్, వీరస్వామి తదితరులున్నారు.

ఓసీపీ-1ను సందర్శించిన ఐఆర్‌వో


క్వారీని పరిశీలిస్తున్న ఐఆర్‌వో మంజునాథ్

గోదావరిఖని: ఆర్జీ-3 ఏరియాలో ఓసీపీ-1 ప్రాజెక్టును కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ డీఐజీ, ఐఆర్‌వో డి.మంజునాథ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ, అటవీ ప్రాంతపు భూముల స్థితిగతులను తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, సంస్థ ఫారెస్ట్ అడ్వైజర్ సురేందర్‌పండేయ్, డీఎఫ్‌వో శివయ్య, ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఎస్‌వోటూ జీఎం భైద్య, రఘుపతి, అధికారులు శ్రీనివాస్, కోటయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వృత్తి శిక్షణ కోర్సుల్లో చేరండి

గోదావరిఖని: ఉచిత వృత్తి శిక్షణ కోర్సులను ఆర్జీ-1 ఏరియాలో నిర్వహిస్తున్నట్లు జీఎం చింతల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు, మాజీ ఉద్యోగులు, ప్రభావిత గ్రామాల పిల్లలు ఇందులో చేరవచ్చన్నారు. శిక్షణ ఈ నెల 12న ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో సంప్రదించాలని సూచించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

సుల్తానాబాద్: స్థానిక కోర్టు న్యాయవాదులు గురువారం తమ విధులు బహిష్కరించారు. ఇక్కడ గతంలో పనిచేసిన జడ్జి పార్థసారథి, రిటైర్డ్ జడ్జి లక్ష్మీమనోహర్‌రావుల మృతికి సంతాప సూచకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కోర్టు హాల్లో వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలకిషన్ ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మీరాజ్యం, ఆంజనేయులు, సర్వోత్తమ్ రెడ్డి, శ్రీరాములు, శివ, భూమయ్య, రవికిరణ్ గౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్ వేద్దామా? ఆగుదామా?

- వేచిచూసే ధోరణిలోనే చాలామంది
- తక్కువ టెండర్లు వచ్చిన మద్యం దుకాణానికి చివరి నిమిషంలో వేయాలని ఆలోచన
- జిల్లాలో 77 వైన్స్‌లు
- గతంలో 1,080 దరఖాస్తులు


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి

సుల్తానాబాద్: వచ్చే డిసెంబర్ ఒకటో తేదీ నుంచి కొత్త ఎక్సైజ్ పాలసీ ప్రారంభం కానుంది. ఈ క్రమంలో కేవలం ఆదాయం కోసమే 2023 నుంచి 25కు సంబంధించి ప్రభుత్వం ఆగస్టు నెలలోనే మద్యం షాపులకు టెండర్లు పిలిచిందని వైన్స్‌ల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలో 77 మద్యం షాపులు ఉండగా చాలామంది టెండర్లు వేద్దామా? ఆగుదామా? అన్న డైలమాలో ఉన్నారు. గతంలో టెండర్లు పిలిస్తే 1,080 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి తెలిపారు. ఒక్క టెండర్‌కు రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వానికి గతేడాది రూ.21.60 కోట్ల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. టెండర్లు ఇప్పుడు పిలిచినా నవంబర్ 31 వరకు ప్రస్తుతం ఉన్న యజమానులే వైన్స్ నడుపుతారన్నారు. డ్రా కైవసం చేసుకున్నా మూడు నెలల తర్వాతే షాపు తెరవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కుల సంఘాల గ్రూపులు

రాష్ట్ర ప్రభుత్వం మద్యం పాలసీలో గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించింది. గౌడలకు కేటాయించిన షాపుల నంబర్లు.. 40, 64, 67, 21, 52, 20, 22, 70, 63, 66, 8, 12, 49, ఎస్సీలకు కేటాయించిన షాపుల నంబర్లు.. 27, 69, 6, 14, 76, 55, 44, 17. దీంతో ఆయా కుల సంఘాల ప్రతినిధులతోపాటు ఆర్థికంగా నిలదొక్కుకున్న వారు మద్యం షాపుల టెండర్ వేసేందుకు గ్రూపులుగా ఏర్పడి, ముందుకు వస్తున్నారు. జనరల్ స్థానాల్లో ఎప్పుడూ రెడ్లు, రావులే గ్రూపులుగా ఏర్పడి, ఒక్కో వైన్స్‌కు 10 నుంచి 30 వరకు టెండర్లు వేసి, మద్యం షాపులను కైవసం చేసుకుంటున్నారు.

నిబంధనలు, అర్హులు, అనర్హులు..

- వైన్స్ ఎదుట పార్కింగ్ స్థలం ఉండాలి
- ప్రతి షాపు వద్ద 3 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఎక్సైజ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేయాలి.
- దుకాణాల ఎదుట ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలి.
- మైనర్లకు మద్యం విక్రయించొద్దు.
- 21 ఏళ్లు పైబడినవారు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఒక వ్యక్తి ఎన్నింటికైనా అర్జీ పెట్టుకోవచ్చు.
- మూడు ఫొటోలు, పాన్ కార్డు, ఆధార్ కార్డు, వ్యక్తిగతంగా ధ్రువీకరణ చేయాల్సి ఉంది.
- జైలుశిక్ష అనుభవించినవారు అనర్హులు.
- కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి.

18 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఈ నెల 4 నుంచి 18వ తేదీ వరకు పెద్దపల్లి ఐటీఐ ప్రాంగణంలో దరఖాస్తులు తీసుకుంటున్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్, రామగుండం, మంథని ఎక్సైజ్ కార్యాలయాలతోపాటు హైదరాబాద్ కమిషనర్ కార్యాలయానికి సైతం నేరుగా వెళ్లి, దరఖాస్తు చేసుకోవచ్చు.

బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాలి

మద్యం షాపు వచ్చినవారు బ్యాంకు గ్యారెంటీ 25 శాతం ఇవ్వాల్సి ఉంది. గతంలో లైసెన్స్ డబ్బులను వాయిదా పద్ధతుల్లో నాలుగు సార్లు చెల్లించగా ఈ ఏడాది దాన్ని ఆరుసార్లకు పెంచారు.

7 నుంచి 10 శాతం వరకు ట్యాక్స్ లేదు

మద్యం షాపుల నిర్వాహకులు 7 నుంచి 10 శాతం వరకు ట్యాక్స్ చెల్లించకుండా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. రూ.50 లక్షల షాప్ లైసెన్స్ పొందినవారు రూ.5 కోట్ల వరకు మద్యం అమ్మకాలు జరుపుకోవచ్చు.

రూం దొరక్కపోతే మార్పిడికి రూ.25 వేలు

మద్యం షాపు కేటాయించిన ప్రాంతంలో రూం దొరక్కపోతే మార్పిడికి ఈ ఏడాది రూ.25 వేలు చెల్లించాలి. గతంలో రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఉండగా పెంచారు. లక్కీ డ్రా సమయంలో వీడియో తీయనున్నారు.

ఆదాయం సమకూర్చుకునేందుకే..



రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం సమకూర్చేందుకే వైన్స్ టెండర్లు ఆహ్వానించింది. టెండర్ వేసేందుకు ఎక్కువ మంది ఉత్సాహం చూపడం లేదు. చివరి నిమిషంలో ఏ దుకాణానికి తక్కువ టెండర్లు వచ్చాయో చూసుకొని, వేయాలనుకుంటున్నారు.

– దుగ్యాల సంతోష్‌రావు, మద్యం షాపు యజమాని, సుల్తానాబాద్

రిజర్వేషన్ వినియోగించుకోవాలి



గౌడ, ఎస్సీ కులస్తులు వైన్స్ టెండర్లలో రిజర్వేషన్ అవకాశాన్ని వినియోగించుకోవాలి. డీడీలు తీసి, దరఖాస్తులను పెద్దపల్లి ఐటీఐ ప్రాంగణంలో అందజేయాలి. 21న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చేతులమీదుగా లక్కీ డ్రా తీస్తాం.

– మహిపాల్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, పెద్దపల్లి

ఆర్జీ-3 జీఎం ఆఫీస్‌లో బయోమెట్రిక్



రామగిరి: ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు ఇక నుంచి బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేసుకోవాలని ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు అన్నారు. సింగరేణి కార్పొరేట్ ఐటీ విభాగం ఆదేశాల మేరకు జీఎం కార్యాలయంలో గురువారం బయోమెట్రిక్ హాజరును ప్రారంభించారు. కొన్ని రోజుల్లో గనుల్లోనూ ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ సీతారామం, డీవైపీఎంలు మారుతి, శ్రీహరి, ఐటీఆర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వ్యాన్ దగ్ధం



ధర్మారం: గోపాల్‌రావుపేట శివారులో ఓ వ్యాన్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. గోపాల్‌రావుపేట శివారు నుంచి కర్రలను తరలించేందుకు ఓ వ్యాపారి బుధవారం వ్యాన్‌లో వచ్చాడు. చీకటి పడటంతో సగం లోడ్ చేసి, వాహనాన్ని అక్కడే ఉంచి, కూలీలతో వెళ్లిపోయాడు. విద్యుత్ తీగల సమీపంలో ఉన్న వ్యాన్ గురువారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌కు గురై, మంటలు లేచాయి. డ్రైవర్ సతీశ్ ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ వీలుకాలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని, మంటలను ఆర్పివేశారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఆర్జీ-2 ఏరియా అఫిషియేటింగ్ జీఎం కె.శ్రీనివాస్ రెడ్డి


మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్ రెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ: విద్యార్థులు మన దేశ స్వాతంత్ర్యం కోసం కృషి చేసిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆర్జీ-2 ఏరియా అఫిషియేటింగ్ జీఎం కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ సెక్టార్-3 సింగరేణి పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని, మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. దేశాభివృద్ధిలో మత సామరస్యం పాత్ర అనే అంశంపై వ్యాసరచన, తెలంగాణ ఏర్పడటానికి ముందు, తర్వాత రాష్ట్రంలో వచ్చిన మార్పులపై ఉపన్యాస, స్వచ్ఛ భారత్ అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అండ్ అధికార ప్రతినిధి జి.రాజేంద్రప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం సుందర్‌రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ మండల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తీసుకున్న డబ్బులు ఇవ్వడం లేదని..

- కుటుంబంతో సహా వ్యక్తి ఆత్మహత్యాయత్నం


ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న శ్రీనివాస్

గోదావరిఖని: ఓ వ్యక్తి అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో ఇచ్చిన వ్యక్తి తన కుటుంబసభ్యులతో కలిసి ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖని కల్యాణ్‌నగర్‌కు చెందిన మంథని శ్రీనివాస్ స్థానికంగా ఓ వ్యక్తికి ఏడాది క్రితం రూ.6.50 లక్షలు అప్పుగా ఇచ్చాడు. ఎన్నిసార్లు అడిగినా తిరిగి ఇవ్వకపోవడంతో గురువారం తన కుటుంబసభ్యులతో కలిసి ఆ వ్యక్తి ఇంటికి వెళ్లి, ఆందోళన చేపట్టాడు. అప్పు తీసుకున్న వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో అందరూ ఒంటిపై పెట్రోల్ పోసుకొని, ఆత్మహత్యాయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే, తీసుకున్న అప్పు చెల్లించే విషయమై గతంలో ఠాణాలోనే పంచాయితీ జరిగినట్లు తెలిసింది.

లేడీస్ క్లబ్‌లో ఫ్రెండ్‌షిప్ డే



గోదావరిఖని: స్థానిక ఇల్లెందు క్లబ్‌లో లేడీస్ క్లబ్ ఫ్రెండ్‌షిప్ డే గురువారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఫైనాన్స్ ఏజీఎం సతీమణి అరుణను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్జీ-1 సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి, జీఎంల సతీమణులు వేణి, విజయ, పద్మరావు, ప్రియదర్శిని, క్లబ్ సెక్రటరీ బీనాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్ర-2కు ఉమ్మడి జిల్లా మెజీషియన్లు

కోల్‌సిటీ: కేరళలోని కొచ్చి ప్రాంతంలో ఈ నెల 13, 14వ తేదీల్లో మంత్ర-2 పేరిట నిర్వహించనున్న అంతర్జాతీయ ఇంద్రజాలికుల సమావేశానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 9 మంది మెజీషియన్లు హాజరుకానున్నారు. గోదావరిఖనికి చెందిన మేజిక్ రాజా, హరి, అలాడీన్, మాస్టర్ అస్లాంతోపాటు కరీంనగర్, జగిత్యాల జిల్లాలకు చెందిన ఎస్.మల్లేశం, యతిరాజ్, నరేన్, సత్యం, ఎన్.మల్లేశం శుక్రవారం కొచ్చి వెళ్లనున్నారు. మెజీషియన్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు మేజిక్ రాజా గురువారం మాట్లాడుతూ.. కేరళ రాష్ట్ర పర్యాటకశాఖ, కేరళ సంగీత నాటక అకాడమీ, మలేషియన్ మేజిక్ సొసైటీ సంయుక్త సహకారంతో సామ్రాజ్ వరల్డ్ ఆఫ్ మేజిక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1,000 మందికి పైగా జాతీయ, అంతర్జాతీయ ఇంద్రజాలికులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఎన్టీపీసీకి డైరెక్టర్ రాక


రమేశ్‌బాబు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో పర్యటించేందుకు శుక్రవారం సంస్థ డైరెక్టర్(ఆపరేషన్స్) వి.రమేశ్‌బాబు రానున్నారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన మధ్యాహ్నం సమయంలో పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిభవన్‌కు చేరుకుంటారు. ఆయనతోపాటు సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఛటోపాధ్యాయ రానున్నారు. స్టేజీ-1లోని ఒక్కో యూనిట్ 800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల రెండు యూనిట్లను పరిశీలించనున్నారు.

14న జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో ఈ నెల 14న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నర్సింహాచారి ఒక ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో జరిగే ఈ మేళాను ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హైదరాబాద్, కరీంనగర్ నుంచి పలు కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. ఐటీఐ పాసైనవారు, ఫలితాల కోసం వేచిచూస్తున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలనిసూచించారు.

గోదావరిలో వ్యక్తి గల్లంతు?

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరి నది బ్రిడ్జి వద్ద గురువారం సాయంత్రం సింగరేణి రిటైర్డ్ కార్మికుడు గల్లంతయినట్లు తెలిసింది. గోదావరిఖని రమేశ్‌నగర్‌కు చెందిన మాజీ కార్మికుడు బ్రిడ్జి వద్దకు వచ్చి, నదిలో దూకాడా లేదా స్నానం చేసేందుకు దిగాడా అనేది తెలియడం లేదు. బ్రిడ్జి వద్ద అతనికి సంబంధించిన పాదరక్షలు, దుస్తులు ఉండటంతో పోలీసులు అక్కడికి చేరుకొని, పరిశీలించారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని టూటౌన్ పోలీసులు తెలిపారు.

సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కు పేర్లు నమోదు చేసుకోండి

పెద్దపల్లిరూరల్: ఆలిండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను ఈ నెల 16లోగా నమోదు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, వాలీబాల్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్, గ్రీకో రోమన్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల పురుష, మహిళా ఉద్యోగులు పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

మంత్రి ఈశ్వర్ వద్దకు ఆశావహులు

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఆశావహులు మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను గురువారం కరీంనగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి, పలు అంశాలపై చర్చించారు. జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, కొంకటి లక్ష్మీనారాయణ, మిర్యాల రాజిరెడ్డి, పాతిపెల్లి ఎల్లయ్య, మనోహర్‌రెడ్డి మంత్రితో సమావేశమయ్యారు. గోదావరిఖనిలో ఈ నెల 13న నిర్వహించే బీఆర్‌ఎస్ సభ విజయవంతానికి కలిసికట్టుగా పని చేస్తామని తెలిపారు.

గెలిపిస్తే సొంతింటి కల నిజం చేస్తా

- మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ
- సింగరేణి కార్మికులతో గేట్ మీటింగ్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ

గోదావరిఖని: రాబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సింగరేణి కార్మికుల సొంతింటి కల నిజం చేస్తానని మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం ఆర్జీ-1 ఏరియా జీడీకే-1వ గని, ఏరియా వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులకు బీజేపీ వ్యతిరేకం కాదని, ప్రధాని నరేంద్రమోదీ వారి సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి, దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో రామగుండం నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి, చూపించానన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, 24 గంటల నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నానని పేర్కొన్నారు. కార్మికులకు దుస్తులు, బూట్లు, టోపీ, బెల్టు ఇతర సామగ్రిని సింగరేణి ద్వారా ఇప్పించే హక్కును సాధిస్తానని హామీ ఇచ్చారు. గతంలో తాను చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని, రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పిడుగు కృష్ణ, సోమారపు లావణ్య, అరుణ్‌కుమార్, మంచికట్ల భిక్షపతి, కోదాటి ప్రవీణ్, బద్రి దేవేందర్, పత్తి సంజీవ్, డేవిడ్‌రాజ్, కొమ్ము శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ వర్సిటీలో ప్రవేశానికి 16 వరకు గడువు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలోని ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి గడువు ఈ నెల 16 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య, సమన్వయకర్త శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిప్లొమా, రెండేళ్ల ఐటీఐ కోర్సు, నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా సీనియర్ ఇంటర్ పూర్తయిన విద్యార్థులందరూ ఓపెన్ డిగ్రీలో చేరేందుకు అర్హులన్నారు. ఐటీఐ(రెండేళ్ల కోర్సు) పూర్తి చేసినవారికి రెగ్యులర్‌గా డిగ్రీ చదివే అవకాశం లేదని, కానీ ఓపెన్ యూనివర్సిటీ ఆ అవకాశం ఇచ్చిందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎంబీఏలో చేరేందుకు 20లోగా దరఖాస్తు చేసుకోండి

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఎంబీఏలో ప్రవేశం పొందేందుకు ఆసక్తి గలవారు ఈ నెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐసెట్ రాయని, రాసినా ఉత్తీర్ణులు కానీ అభ్యర్థుల కోసం యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఓపెన్ యూనివర్సిటీ కేంద్రం లేదా 73829 29654 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వేతన ఒప్పంద చర్చలు మళ్లీ వాయిదా

- సెప్టెంబర్ 6న నిర్వహిస్తామని ప్రకటించిన ఆర్‌ఎల్‌సీ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందంపై హైదరాబాద్‌లోని రీజినల్ లేబర్ కమిషనర్(ఆర్‌ఎల్‌సీ) సునీల్‌కుమార్ సాహూ సమక్షంలో జరిగిన చర్చలు మళ్లీ వాయిదా పడ్డాయి. గురువారం ఆర్‌ఎల్‌సీ కార్యాలయంలో కమిషన్ ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్‌ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్, అధికారులు శామ్యూల్ ప్రశాంత్, దీపక్ పాలక్, కాంట్రాక్టర్లు ఏబీసీ రెడ్డి, దాడి శ్రీనివాస్, ఎస్.నారాయణ, మధుకర్, ఎన్టీపీసీ రామగుండం కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, భూమల్ల చందర్, ఇజ్జగిరి భూమయ్య, గీట్ల లక్ష్మారెడ్డి, జయసింహ, శ్రీనివాస్, సత్యనారాయణ, జమీల్ తదితరులతో అలవెన్సులపై సుదీర్ఘంగా చర్చించారు. ఎన్టీపీసీ రామగుండం యాజమాన్యం బుధవారం ప్రాజెక్టు పరిపాలనా భవనంలో నిర్వహించిన సమావేశంలో అలవెన్సు రూ.700 ఇవ్వనున్నట్లు చెప్పడంతో కార్మిక సంఘాల నాయకులు ఒప్పుకోలేదు. ప్రాజెక్టు పరిధిలో మరో 10 రోజులు చర్చలకు అవకాశం ఉందని, రామగుండంలో చర్చలను కొనసాగించి, ఇరుపక్షాలు ఒక అంగీకారానికి రావాలని ఆర్‌ఎల్‌సీ సూచించారు. అనంతరం చర్చలు సెప్టెంబర్ 6వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

పద్మశాలీలు రాజ్యాధికారం కోసం పోరాడాలి

కాల్వశ్రీరాంపూర్: పద్మశాలీలు రాజ్యాధికారం కోసం పోరాడాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల రామ్మూర్తి అన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో గురువారం చలో కోరుట్ల-పద్మశాలీ రాజకీయ యుద్ధభేరికి సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని, చట్టసభల్లోకి వెళ్తేనే చేనేత కార్మికులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. యుద్ధభేరి కార్యక్రమానికి జిల్లా నుంచి పద్మశాలీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సంఘం మండల శాఖ అధ్యక్షుడు సబ్బని రాజమల్లు, గ్రామశాఖ అధ్యక్షుడు గోలి సుధాకర్, నాయకులు సాయిరి మహేందర్, ఆడెపు రాజు, బైరి రాజవీరు, ఒడ్నాల నర్సయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మంథని: నాగారం గ్రామానికి చెందిన జక్కుల పవన్(20) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే పవన్ ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై, మంగళవారం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి తండ్రి రాజకొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

23 ఏళ్లుగా సేవలందిస్తున్నా పట్టించుకోరా?


నిరసన తెలుపుతున్న గోపాలమిత్రలు

పెద్దపల్లిరూరల్:పల్లెల్లో పాల దిగుబడి పెంచేలా పశువులకు కృత్రిమ గర్భధారణ చేయడంతోపాటు, కార్యాలయ పనుల్లోనూ భాగస్వామ్యం అవుతున్న తమను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని గోపాలమిత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్ది సమ్మయ్య, సెక్రటరీ సదయ్య అన్నారు. కలెక్టరేట్ ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. 23 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను పట్టించుకోకుండా పశుసంవర్ధక శాఖలో ఇతర శాఖల వారికి శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి పాడిపశువులకు సేవలందిస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు తిరుపతి, ప్రవీణ్, సురేశ్, కుమార్, శ్రీనివాస్, నరేశ్, రవీందర్, ఓదెలు తదితరులున్నారు.